క్లుప్తంగా

ముక్కంటి సేవలో మహారాష్ట్ర సీఎం కుమారుడు



ఎంపీ శ్రీకాంత్ షిండేతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఈవో

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే కుమారుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఈవో కేఎస్ రామారావు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురు దక్షిణా మూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం



నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులు, పేదలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ గొప్పవాడు కావాలంటే నాయకుడు కావాల్సిన పనిలేదని, సేవా కార్యక్రమాలే వారికి గుర్తింపును తీసుకువస్తాయని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత మునీర్‌బాషా అని తెలిపారు. ఈ కార్యక్రమలో సంస్థ నిర్వాహకుడు మునీర్‌బాషా, సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, రాజేశ్వరరావు, కంఠా ఉదయ్, బాబాఫరీద్, ఢిల్లీ కుమార్, మునికృష్ణ, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సులభ దర్శనం



క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తులకు సులభ దర్శనం కల్పించారు. మార్గశిర శుద్ధ త్రయోదశి కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ సామాన్య భక్తులు, వీఐపీలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

మాలమహానాడు జిల్లా ఇన్‌చార్జిగా పెంచలయ్య



తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మాలమహానాడు తిరుపతి జిల్లా ఇన్‌చార్జిగా శ్రీకాళహస్తి మండలం బీవీపురానికి చెందిన పెంచలయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రాజు ఉత్తర్వులు జారీ చేశా రు. ఆయనను పలువురు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

సత్యవేడు: మండల పరిధిలోని ముదిరాజ్ సంఘం సభ్యులు 2024వ సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు పామాంజి గురుప్రసాద్, ముదిరాజ్ సేవాసంఘం అధ్యక్షుడు హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం నాయకులు కుమార్, కోళ్ల మురళి, పరంధామయ్య, లక్ష్మీనారాయణ, మునిప్రతాప్, నాగరాజు పాల్గొన్నారు.

కరాటేలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి ప్రతిభ



పాంద్ర జిష్ణూష్

శ్రీకాళహస్తి : కరాటే పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి పాంద్ర జిష్ణూష్ ప్రతిభ చూపాడు. తిరుపతిలో నిర్వహించిన కరాటే పోటీల్లో రెండు పతకాలు సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. ఈ విద్యార్థిని పాఠశాల నిర్వాహకులు అభినందించారు.

వరదయ్యపాళెం పెట్రోల్ బంకు సమీపంలో రెండిళ్ల మధ్య ఆక్రమణకు గురైన సాగునీటి కాలువ, ప్రైవేట్ వెంచర్ వద్ద ఆక్రమణకు గురైన సాగునీటి కాలువ (ఫైల్)





దర్జాగా కబ్జా

- వరదయ్యపాళెంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు
- సాఫీగా సాగని వరదనీరు
- కాలువలు కుదించి ఇళ్ల నిర్మాణం
- పట్టనట్టు వ్యవహరిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో సాగునీటి కాలువలు దర్జాగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఏకంగా కాలువలను కుదించి పెద్దపెద్ద భవంతులను నిర్మింపజేస్తున్నారు. దీంతో భారీ వర్షాల సమయంలో సాఫీగా సాగాల్సిన వరదనీరు ముందుకు సాగక రోడ్లపైకి పార్లి ఏకంగా గోవర్ధనపురం నుంచి బస్టాండ్ వరకు వరద ప్రవాహం ఉధృతమవుతోంది. అంతేగాక శ్రీకాళహస్తి-తడ ప్రధాన రోడ్డు మార్గంలోని వరదయ్యపాళెం బస్టాండ్ నుంచి గోవర్ధనపురం వరకు ఇళ్లు జలదిగ్బంధనంలో చిక్కుకుంటున్నాయి. గోవర్ధనపురం వద్ద మారేడు కాలువ ఉంది. ప్రధాన రోడ్డు మార్గంలో రాకపోకలు సాగేందుకు ఈ కాలువపై లోలెవల్ కాజ్‌వేను నిర్మించారు. ఈ కాజ్‌వేకు రెండు వైపులా కాలువ మార్గంలో ఆక్రమణలకు గురైంది. అలాగే స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో వరదయ్యపాళెం చెరువు నుంచి దిగువ పొలాలకు సాగునీరు వెళ్లేందుకు గతంలో సాగునీటి కాలువ ఏర్పాటైంది. అయితే ఆ కాలువ చుట్టూ ఇళ్ల నిర్మాణం కావడం, మరోవైపు రియల్ ఎస్టేట్ వెంచర్లతో కాలువ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. 3 మీటర్లకు పైగా ఉండాల్సిన కాలువ 3 అడుగులకు చేరింది. దీంతో వర్షం పడినప్పుడల్లా పెట్రోల్ బంకు వద్ద రోడ్డు ఇవతలి నుంచి అవతలి వైపునకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

నిద్రావస్థలో ఇరిగేషన్ శాఖ

ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వరదయ్యపాళెం మండల కేంద్రంలో సెంటు భూమి రూ.25లక్షలు పైమాటే. ఇలాంటి పరిస్థితుల్లో సాగునీటి కాలువలను అక్రమార్కులు వదలడం లేదు. పెట్రోల్ బంకు ఎదురుగా రెండిళ్ల మధ్య సాగునీటి కాలువ సన్నగిల్లి పోయింది. అలాగే ఇటీవల అదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ప్రహరీ గోడ నిర్మాణం చేశారు. ఇది కాలువకు ఆనుకుని ఉంది. ఇక్కడ కొంత కాలువ ఆక్రమణకు గురైనట్టు స్థానికులు చెబుతున్నారు.

ఆక్రమణలపై దృష్టి పెడతాం



వరదయ్యపాళెంలో సాగునీటి కాలువల ఆక్రమణల గురించి ఇటీవల కురిసిన వర్షాల సమయంలో తెలుసుకున్నాం. స్థానికంగా కాలువలు ఎక్కడ నుంచి, ఎంతవరకు కొనసాగుతున్నాయో రికార్డులు పరిశీలిస్తాం. తదుపరి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తిస్తాం. ఆక్రమణలు జరిగి ఉంటే తక్షణమే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
–గౌరీశంకరరావు, తహసీల్దార్, వరదయ్యపాళెం

ముందుంది ముప్పు

మండల కేంద్రంలో అసలే మురుగునీటి కాలువలు లేవు. దీనికి తోడు ఉన్న సాగునీటి కాలువలు ఆక్రమణలకు గురైతే రానున్న రోజుల్లో పెను ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి కాలువలు మునుపటి లాగా ఉంటే వరద నీరు సాఫీగా సాగుతుంది. ఈ పరిస్థితుల్లో ఆక్రమణకు గురైన కాలువలను యథావిధిగా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



సాగునీటి కాలువల ఆక్రమణతో వరదయ్యపాళెం ప్రధాన రోడ్డులో జలదిగ్బంధంలో ఉన్న ఇళ్లు (ఫైల్)

అధ్వానంగా కేటీ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: శ్రీకాళహస్తి-తడ రోడ్డు తుపాన్ కారణంగా ధ్వంసమైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రీకాళహస్తి నుంచి తడ వరకు 44 కి.మీ, వరదయ్యపాళెం మండలం వరకు 30 కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. రోజుకు 2,500 వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్డు ఆలత్తూరు, చల్లమాంబపురం, పదవమైలు, తలారివెట్టు, కారణిమిట్ట, నెలవాయి గ్రామాలవద్ద గుంతలమయమైంది. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చురొచ్చుగా తయారవుతోంది. రోడ్డు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.



పదవమైలులో కేటీ రోడ్డుపై ఉన్న గొయ్యి





అరిగిలకండ్రిగ గ్రామం వద్ద దెబ్బతిన్న రోడ్డు, ఆలత్తూరు గ్రామం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

సమస్యలు పరిష్కరించండి



సమావేశమైన భవన నిర్మాణ కార్మికులు

వరదయ్యపాళెం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి చంద్రబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షుడు కోటి అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజిస్టర్ చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు సబ్సిడీపై పనిముట్లు, ప్రమాద బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు మధు, గోపి, చంద్రయ్య, సుబ్బులు పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ



అయోధ్య శ్రీరాంలాల పూజిత అక్షింతలను తీసుకొస్తున్న భక్తులు



అక్షింతలను పంపిణీ చేస్తున్న నిర్వహకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో ఆదివారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాంలాల పూజిత అక్షింతలను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీలలోని రామభక్తులకు అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాంలాల పూజిత అక్షింతలను పంపిణీ చేసినట్టు వెల్లడించారు. ఈ అక్షింతలను గ్రామాలలోని గుడిలో 6వ తేదీ వరకు పూజలు నిర్వహించిన తర్వాత ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని వారు కోరారు.

విద్యార్థులకు వసతుల కల్పన



సత్యవేడు.. 1988-89 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

సత్యవేడు: పూర్వ విద్యార్థులు సామాజిక సేవలో తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు 1988–89 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం బేరిశెట్టి కల్యాణ మండపంలో ఒక్కటయ్యారు. నేస్తం పేరుతో నియోజకవర్గంలోని పాఠశాలల్లో వసతులు కల్పించాలని సంకల్పించారు. అనంతరం తమ ఉన్నతికి కృషి చేసిన అప్పటి ఇంగ్లిషు, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలు వసంతమ్మను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.కుమార్, శాంతాకుమార్, ప్రసాద్‌రెడ్డి మేయ్యప్పన్, ప్రభాకర్, గోకులకృష్ణ, వెంకటేశ్వర్లు, లోకేష్, ఉషా, కేఆర్.వాణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ముస్తాబైన చర్చిలు



బుచ్చినాయుడుకండ్రిగలో క్రైస్తవుల ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో క్రిస్మస్ సందడి నెలకొంది. స్థానికంగా ఉన్న 36 చర్చిలు విద్యుద్దీప కాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. చర్చి లోపల రకరకాల ప్లాస్టిక్ పూలను అలకరించారు. క్రిస్మస్ సంబరాలు సోమవారం నుంచి జనవరి 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు క్రైస్తవులు తెలిపారు. ఈ మేరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్రైస్తవుల ర్యాలీ


బుచ్చినాయుడుకండ్రిగలో మెయిన్ రోడ్డులో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. పాస్టరు సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ యేసుక్రీస్తు పాపుల రక్షణ కోసం జన్మించారని, ఆయన సువార్తను అందరికీ తెలియజేయడానికి ర్యాలీ చేస్తున్నట్టు వెల్లడించారు. పాస్టర్లు జాన్‌పీటర్, జయపాల్, సురేష్‌బాబు, ఆశీర్వాదం, రాజారావు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

వరదయ్యపాళెం: క్రిస్మస్ వేడుకలకు మండలంలోని క్రిస్టియన్ చర్చిలు ముస్తాబయ్యాయి. వరదయ్యపాళెం, సంతవేలూరు, రాచర్ల, బత్తలవల్లం, చిన్నపాండూరు, కంచరపాళెం, కాంబాకం, కారిపాకం, చిలమత్తూరు ప్రాంతాల్లోని చర్చిలు ఆదివారం నుంచే విద్యుత్ అలంకరణలతో ఆకట్టుకుంటున్నాయి. సోమవారం జరగనున్న క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిల్లో ప్రార్థనలు చేసేందుకు పాస్టర్లు ఏర్పాట్లు చేపడుతున్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో చర్చి లోపల ప్లాస్టిక్ పూల అలంకరణ



బుచ్చినాయుడుకండ్రిగ మండలం కాంపాళెంలో విద్యుత్ దీపాల అలంకరణతో చర్చి



చిన్న పాండూరులో ముస్తాబైన అద్భుత పెంతకొస్తు చర్చి

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు ఉజ్వల భవిత



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- 2కే రన్ ప్రారంభం

శ్రీకాళహస్తి: ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై అవగాహన కల్పిస్తూ ఆదివారం శ్రీకాళహస్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 2కే మారథాన్ రన్ ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం యువతకు మంచి అవకాశమని, ప్రస్తుతం యువతలో ఫిజికల్ ఫిట్నెస్ సరిగా ఉండడం లేదన్నారు. ఇది ఒక్క చక్కని అవకాశం అని తెలిపారు. ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరమని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ అవకాశాన్ని యువ క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ రమేష్ బాబు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు పగడాల రాజు, ముత్యాల పార్థసారథి, మున్నా, జయశ్యామ్, లక్కమనేని కృష్ణ, తిరకాల మల్లికార్జున్ గౌడ్, రాముగుప్తా, ఆర్కాడు శంకర్, మాధవయ్య, శివారెడ్డి, ఫజల్, రుష్యేంద్రమణి, ఆర్కాడు హేమంత్, సురేష్‌బాబు, మునికృష్ణారెడ్డి, పసల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే

ఏసుక్రీస్తు జననం మానవాళికి సందేశం



ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: ఏసుక్రీస్తు జననం, జీవితం మానవాళికి సందేశమని, ఆయన జన్మదినం సందర్భంగా సోమవారం నియోజకవర్గంలోని క్రైస్తవలందరూ ఆనందోత్సాహాలతో అత్యంత వైభవంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సాటి మనుషుల పట్ల ప్రేమ, సమస్త జీవులపై కరుణ కలిగిన ఏసు ప్రభువు జీవనశైలిని, బోధనలను పాటించడమే క్రిస్మస్ పండుగకు నిజమైన అర్థమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా హిందూ ధార్మిక సమ్మేళనం



మాట్లాడుతున్న వక్తలు



ర్యాలీ చేస్తున్న సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల నుంచి వారం వారం భజన బృందాలు, ప్రతి నెలా జరిగే పౌర్ణమి హారతి బృందాలు, భజన కళాకారులు, అయ్యప్ప భక్తులు, ఓం శక్తి గురువులు, ఎస్ఎస్ఎఫ్ గ్రామ ధార్మిక సమితులు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల నుంచి సుమారు 42 గ్రామాలకు చెందిన 700 మందితో శ్రీకాళహస్తి నాలుగు మాడ వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో పూజాప్రతాప్ స్వామీజీ మాట్లాడుతూ ప్రతి హిందు బంధువు పౌర్ణమి హారతిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు, గరికపాటి రమేష్, సుధాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, కోదండం, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ద్వాదశి



ఉత్తరముఖ ద్వార ప్రవేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు



దర్శనానంతరం ఆలయ మర్యాదలను అందుకుంటున్న మంత్రి ఆర్కే రోజా

నారాయణవనం: పద్మావతీ సమేత కళ్యాణ వెంకన్న ఆలయంలో ఆదివారం వైకుంఠ ద్వాదశిని ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వార ప్రవేశం కోసం భక్తులు పోటెత్తారు. సుమారు 40 వేల మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంత్రి ఆర్కే రోజా, స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉత్తర ద్వారం నుంచి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, డిప్యూటీ ఈఈ రాఘవయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఏఈ గురుప్రకాష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



అన్నప్రసాదాలు అందుకుంటున్న భక్తులు



పునితశౌరి చర్చిలో ఏర్పాట్లు



ఏసుక్రీస్తు జననం దృశ్యం



ముస్తాబైన పునీత శౌరి చర్చి

ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

శ్రీకాళహస్తి: పట్టణంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యాయి. శ్రీకాళహస్తి శివారులోని లూథరన్, పునితశౌరి చర్చిలను సుందరంగా అలంకరించారు. క్రీస్తు జననం, శిలువ వేసిన తదితర దృశ్యాలను ఏర్పాటు చేశారు. పునీతశౌరి చర్చిలో ఫాదర్ కిరీట్, లూథరన్ చర్చిలో ఫాదర్ మైకెల్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం ప్రార్థనలు చేశారు.